ప్రజాశక్తి

గురువారం 18 ఏప్రిల్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



నామినేషన్లు స్వీకరించే జిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

నేటి నుంచి నామినేషన్ల ఘట్టం

- నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లు
- ఎంపి అభ్యర్థులకు కలెక్టరేట్‌లలో దాఖలుకు అవకాశం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నికల ప్రక్రియలో తొలి ఘట్టం నామినేషన్ స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీచేసే అభ్యర్థులు ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమర్పించొచ్చు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే నామినేషన్లు స్వీకరిస్తారు. లోక్‌సభ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లను గుంటూరు, నరసరావుపేటలోని కలెక్టరేట్‌లలో పార్లమెంట్ స్థానాలకు రిటర్నింగ్ అధికారులుగా ఉన్న జిల్లా కలెక్టర్‌లు స్వీకరిస్తారు. చివరిరోజు 25వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. మూడు గంటలకు ఒక్క నిమిషం దాటినా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నామినేషన్ తీసుకోవడానికి అవకాశం ఉండదని అధికారులు ప్రకటించారు. నామినేషన్‌ల పరిశీలన 26వ తేదీన జరుగుతుంది. 27 నుంచి 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఎన్నికల ప్రచారం మే 11 సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. 13 పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

నామినేషన్లు సందర్భంగా ర్యాలీలు, ప్రదర్శనలపై ఆంక్షలు విధించారు. 100 మీటర్ల దూరంలోనే ఈ ప్రదర్శనలు నిలిపి వేయాలని, అభ్యర్థితో పాటు మరో నలుగురు మాత్రమే రిటర్నింగ్ అధికారి వద్దకు రావాలని నిబంధన విధించారు. నామినేషన్ పత్రాలతో పాటు 13 రకాల ధ్రువపత్రాలను జత చేయాలని ఎన్నికల కమిషన్ నిబంధన విధించింది. ప్రధానంగా నేర చరిత్రకు సంబంధించిన అన్ని ఎఫ్ఐఆర్‌ల వివరాలను నామినేషనలలో పూర్తి వివరాలను పొందుపరచాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. దీంతో అభ్యర్థులంతా తమ రాజకీయ వ్యక్తిగత జీవితంలో నమోదైన కేసుల వివరాలను ఆయా పోలీస్ స్టేషన్‌ల నుంచి సేకరిస్తున్నారు. ఇందుకు అవసరమైన డాక్యుమెంట్స్ సమీకరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్‌లలో తమపై నమోదైన కేసుల వివరాలు కూడా తెప్పించుకుంటున్నారు.

నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచి అభ్యర్థుల వ్యయ పరిశీలన, నమోదు జరుగుతుంది. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం–2ఎ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం–2బి సమర్పించాలి. సెలవు దినాలు మినహా పని దినాల్లో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు.

నామినేషన్ దాఖలు సమాచారం

ఏప్రిల్ 18 - నామినేషన్ల స్వీకరణ
ఏప్రిల్ 25 - నామినేషన్లకు చివరి తేదీ
ఏప్రిల్ 26 - నామినేషన్ల పరిశీలన
ఏప్రిల్ 29 - నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేదీ
మే 13 - పోలింగ్
జూన్ 4 - ఎన్నికల ఫలితాలు

పల్నాడులో దాహం కేకలు

- పూర్తిస్థాయిలో పని చేయని రక్షిత నీటి పథకాలు
- కొన్ని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా పరిమిత సరఫరా
- నత్త నడకన జల్ జీవన్ మిషన్ పనులు



నాదెండ్లలో ఎండిపోయిన చెరువులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మండే ఎండలతో ఉక్కపోత తాళలేక ఒకవైపు ప్రజలు ఇబ్బందులు పడుతుండగా మరోవైపు తాగునీటి సమస్య పల్నాడు ప్రజలను కంటతడి పెట్టిస్తోంది. వేసవి ప్రారంభమై నెల కావొస్తున్నా జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీటి సరఫరా సరిగా లేదు. తాగునీటి ఎద్దడి తీర్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నా అవి సఫలీకృతం కావడం లేదు. బొల్లాపల్లి, వెల్దుర్తి, మాచవరం, దాచేపల్లి, రెంటచింతల మండలాల్లో 1500 అడుగుల మేర బోర్లు వేసినా చుక్క నీరు రావడం గగనమవగా పొలాల్లోని వ్యవసాయ బావులు, బోర్లు, వాగులు కుంటలూ ఎండి తాగునీటి కోసం జనం దేవులాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

గతేడాది వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో సాధారణంగా ఉండే నీటి కష్టాలు మరింత తీవ్ర రూపం దాల్చాయి. వ్యవసాయ బోర్లకు సైతం నీరు అందడం లేదు. బొల్లాపల్లి, వెల్దుర్తి, మాచవరం, దాచేపల్లి, రెంటచింతల మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న మండలాల్లోని 15 గ్రామాల్లో 8 గ్రామాలకు జిల్లా కలెక్టర్ చొరవతో కొన్ని స్వచ్ఛంద సంస్థలు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తుండగా మరికొన్ని గ్రామాల్లో మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులతో నీటిని సరఫరా చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు నీరు సరఫరా చేసే గ్రామాల్లో మనిషికి 15 లీటర్ల చొప్పున నీటి సరఫరాకు ప్రణాళికలేశారు.



బొల్లాపల్లి మండలంలోని తండాలో వ్యవసాయ మోటారుకు నీరు అందకపోవడంతో బోరు బావిలోకి అదనపు పైపు వేస్తున్న దృశ్యం

జిల్లాలో 2332 రక్షితనీటి పథకాలుండగా నీటి వనరుల్లేక కొన్ని, మరమ్మతులకు గురై మరికొన్ని మొత్తంగా 157 పథకాలు పడకేశాయి. రక్షిత నీటి పథకాలు కొనసాగుతున్న గ్రామాల్లోనూ వాటిని సమర్థవంతంగా నిర్వహించడం లేదు. మూడు నాలుగు

2లో

నీట మునిగిన ఆశలు

- ఈతకెళ్లిన ఇంజినీరింగ్ విద్యార్థి మృతి
- సంగం జాగర్లమూడి వద్ద మరొకరు గల్లంతు



కార్తిక్ మృతదేహం వద్ద కుటుంబీకుల రోధన

ప్రజాశక్తి - మేడికొండూరు

పేదలైన తల్లిదండ్రుల తమ రెక్కలు ముక్కలు చేసుకుని బిడ్డను ఉన్నత చదువులు చదివించారు. ఇంకొన్నాళ్లు ఆగితే తమ బిడ్డ తమకు ఆసరాగా నిలుస్తాడని ఆశించిన తల్లిదండ్రులకు

2లో

సాగర్ నీటిని మరో 10 రోజులివ్వాలి



- క్రమం తప్పకుండా సాగునీరు సరఫరా చేయాలి.
- జనసమ్మర్థ ప్రాంతాల్లో చలివేంద్రాలు, చలువ పందిళ్ల ఏర్పాటు అవసరం
- సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

చెరువులు పూర్తిస్థాయిలో నిండాలంటే సాగర్ నీటి విడుదలను మరో 10 రోజులు పొడిగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. చెరువులకు నింపే నీరు ఎండల తీవ్రతకు ఆవిరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎక్కువ నీటిని చెరువులకు పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఆ నాకీంట బృందం బుధవారం సందర్శించింది. అక్కడనున్న సిబ్బందితో సాగర్ జలాలతో సమ్మర్ స్టోరేజ్‌ను నింపుతున్న తీరును వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కోసం నాగార్జునసాగర్ కుడికాల్వకు నీరు

2లో



బిజెపి మిత్రులను, తొత్తుపార్టీలను ఓడించండి

- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి
- తాడేపల్లిలో సిపిఎం, సిపిఐ అభ్యర్థుల పాదయాత్ర

5లో

సాగర్ నీటిని మరో 10 రోజులివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసిన వెంటనే అధికారులు స్పందించి ఇంజన్లు, మోటార్లు పెట్టి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నింపేందుకు చర్యలు చేపట్టడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పట్టణ కార్యదర్శి డి.విమల మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నుండి 20 మోటార్లతో మంచినీళ్ల చెరువును నింపుతున్నా నింపాల్సిన దానిలో ఇప్పటికీ సగం కూడా నిండలేదని అన్నారు. ఈ నీరు మళ్లీ సాగర్ జలాలు విడుదల చేసే వరకు అంటే జూలై, ఆగస్టు మాసాల వరకు పట్టణ అవసరాలకు సరిపోయ్యే పరిస్థితి లేదన్నారు. ఈ నేపథ్యంలో చెరువును పూర్తిస్థాయిలో నింపటానికి మరో పది రోజులు సమయం పడుతుందని అన్నారు. కావున నాగార్జునసాగర్ జలాల సరఫరాను మరో 10 రోజులు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఎండలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో పట్టణంలోని తాగునీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని కోరారు. లేకుంటే నీటి ఎద్దడి ఏర్పడి తాగునీరు లీటర్ల చొప్పున కొనుక్కొని తాగాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి వస్తే పట్టణ ప్రజలకు ఒక్కొక్క ఇంటికి నెలకు రూ.300 చొప్పున అదనంగా ఖర్చవుతుందని తెలిపారు. సత్తెనపల్లి పట్టణ ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలు అనేక పనుల నిమిత్తం పట్టణానికి వస్తారని, వారు సేద తీర్చుకునేందుకు పట్టణంలో జన సందోహం ఉన్న ప్రదేశాల్లో చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. పరిశీలనలో సిపిఎం నాయకులు కె.శివదుర్గారావు, ఎ.ప్రసాదరావు, పి.ప్రభాకర్, షేక్ మస్తాన్‌వలి, జె.రాజ్‌కుమార్ ఉన్నారు.

నీట మునిగిన ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

కడుపుకోత మిగిలిలింది. స్నేహితులతో కలిసి కాల్వకు వెళ్లిన విద్యార్థి మృత్యువాత పడిన ఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు బ్రాంచ్ కెనాల్ వద్ద బుధవారం జరిగింది. బాపట్ల జిల్లా కేంద్రానికి చెందిన ఇంకొల్లు నాగేశ్వరరావు, సుజిని దంపతుల కుమారుడు కార్తిక్ మేడికొండూరు మండలం డోకిపర్రులోని యూనివర్సల్ కాలేజీలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లోనే ఉంటున్నాడు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా కళాశాల సెలవు కావడంతో పేరేచర్లలోని దేవాలయం వద్దకు స్నేహితులు సుదర్శన్, యశ్వంత్, ఇమ్రాన్‌తో కలిసి వచ్చాడు. అనంతరం పేరేచర్ల గ్రామ సమీపంలో ఉన్న గుంటూరు బ్రాంచ్ కెనాల్ వద్దకు వెళ్లి ఈతకు దిగారు. ఈత కొట్టే క్రమంలో నీటిఉధృతికి కార్తీక్ కొట్టుకుపోతుండగా కాపాడేందుకు ఇమ్రాన్ ప్రయత్నించాడు. అయితే ఇమ్రాన్ కూడా కొట్టుకుపోతుండడంతో మిగతా ఇద్దరు కలిసి ఇమ్రాన్‌ను కాపాడారు. కొద్దిసేపటికే కార్తిక్ గల్లంతవడంతో మిగతా ముగ్గురు తమ స్నేహితులకు సమాచారం ఇచ్చారు. వారు కూడా కాల్వ వద్దకు వచ్చి గాలించారు. ఇంతలో సమాచారం అందుకున్న సిఐ డి.జయకుమార్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు గల్లంతవగా సాయంత్రం 4 గంటలకు ఘటనా స్థలి నుండి 2 కిలోమీటర్ల దూరంలో కార్తిక్ మృతదేహం లభ్యమైంది. కాలేజీ యాజమాన్యం ద్వారా విషయం తెలుసుకున్న మృతుని కుటుంబీకులు కాల్వ వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుని తండ్రి భవన నిర్మాణ కార్మికుడు కాగా వారికి కార్తిక్ ఏకైక కుమారుడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు.

కొమ్మమూరు కెనాల్ లో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - తెనాలి : ఈతకని బుధవారం సాయంత్రం విజ్ఞాన్ లారా కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సంఘం జాగర్లమూడి వచ్చారు. సంగమేశ్వర స్వామి ఆలయం సమీపంలో కాల్వలో ఈతకు దిగేందుకు సిద్ధమయ్యారు. అయితే నలుగురు విద్యార్థులు కాల్వ ఒడ్డున ఉండగా గల్లా వంశీకృష్ణ ఈతకు దిగాడు. అతను మునిగిపోతుండగా గమనించిన మిత్రులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. స్థానికులు కూడా ఆ యువకుడిని కాపాడేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. నీటి ఒరవడికి వంశీకృష్ణ గల్లంతయ్యాడు. వంశీకృష్ణ పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం ఇక్కుర్రుకు చెందిన చెందిన విద్యార్థి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని గాలిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజధాని నమూనా గ్యాలరీ ధ్వంసం



ధ్వంసమైన రాజధాని అమరావతి నమూనా గ్యాలరీ

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రధాని మోడీ రాజధాని అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం పక్కనే ఉన్న రాజధాని నమూనా గ్యాలరీని దుండగులు ధ్వంసం చేశారు. ఉద్ధండరాయునిపాలెంలో రాజధాని అమరావతి నిర్మాణానికి 2015 అక్టోబరు 22న శంకుస్థాపన చేసిన ప్రదేశంలో అమరావతి ముఖచిత్రం, చారిత్రక ఘట్టాలు, మ్యాప్‌లు, కట్టడాలకు సంబంధించిన నమూనాలు, విశేషాలతో ఏర్పాటు చేసిన గ్యాలరీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని రైతులు బుధవారం గుర్తించారు. రక్షణ చర్యలు తీసుకోక పోవడంతో దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారని స్థానిక రైతులు అన్నారు. రాజధాని అమరావతి నమూనా గ్యాలరీ ఉన్న భవనం వద్ద టిడిపి ప్రభుత్వంలో రక్షణ చర్యలు చేపట్టారు. గేట్లు ఏర్పాటు, పోలీసులను కాపలా ఉంచడం లాంటి చర్యలు తీసుకున్నారు. వైసిపి అధికారం చేపట్టిన తర్వాత పోలీసు కాపల ఎత్తివేశారు. దీంతో ఆకతాయిలు రక్షణగా ఏర్పాటు చేసిన గేట్లు పగలగొట్టడం, మద్యం సేవించడం చాలా కాలంగా జరుగుతోందని, ఎవరికి చెప్పాలో కూడా తెలియని అయోమయంలో ఉన్నామని ఉద్ధండరాయునిపాలేనికి చెందిన రైతు రామారావు చెప్పారు. ఇప్పుడు ఏకంగా నమూనా గ్యాలరీనే ధ్వంసం చేశారని వాపోయారు. ఈ చర్యను గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, అమరావతి దళిత జెఎసి, టిడిపి నాయకులు పులి చిన్నా తీవ్రంగా ఖండించారు. సంఘటనా ప్రదేశాన్ని వారు పరిశీలించారు.


ధ్వంసమైన రాజధాని అమరావతి నమూనాల


ధ్వంసమైన రాజధాని అమరావతి నమూనా గ్యాలరీ

దళిత వ్యతిరేకులకు ఆశ్రయమిస్తున్న జగన్ : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

దళితులను అవమానించిన, దళిత వ్యతిరేకులకు ఆశ్రయమిస్తూ దళిత ద్రోహుల పార్టీగా వైసిపి నిలిచిపోయిందని ఎన్‌డిఎ కూటమి తరుపున వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులకు కోర్టు శిక్ష విధించిందని, అలాంటి వ్యక్తులకు వైసిపి ఆశయం ఇవ్వటం దుర్మార్గమని అన్నారు. దళితుడిని చంపిన అనంత బాబును పార్టీ సస్పెండ్ చేసినట్లే చేసి తిరిగి వైసిపి పార్టీలో చేర్చుకుందని, డాక్టర్ సుధాకర్ నుంచి దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎంతోమంది దళిత బిడ్డలు బలైపోయారని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత యువకుడు కాంద్రు శ్యామ్ కుమార్‌ను నిర్బంధించి చిత్రహింసలు పెట్టారని, దాహం వేసి మంచినీళ్లు అడిగితే సభ్య సమాజం తలదించుకునేలా మూత్రం పోసి అవమానించారని చెప్పారు. జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికి 6035 మంది దళితులపై దాడులు జరిగాయని, ఎన్సిఆర్బి నివేదిక ప్రకారం ఏపీ దళితులపై దాడుల్లో 7వ స్థానంలో ఉందని తెలిపారు. 2021లో 208 మంది ఎస్సీ మహిళలు, చిన్నారులపై దాడులు జరగక 33 మంది దళితులు హత్యకు గురయ్యారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 12 వేల ఎకరాల దళితుల భూములను జగన్మోహన్‌రెడ్డి వర్గీయులు లాగేసారన్నారు. వైసీపీకి రానున్న ఎన్నికల్లో దళితులు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.



జీవీ కుమారుని ఆధ్వర్యంలో ర్యాలీ

రేపటి భవిష్యత్.. ఈ రోజు మనచేతుల్లోనే.. అంటూ ఎన్‌డిఎ కూటమి తరుపున వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు పిలుపు మేరకు పట్టణంలో బుధవారం ప్రదర్శన చేశారు. జీవీ ఆంజనేయులు కుమారుడు హరీష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. విష్ణుకుండి నగర్ కాల్వ కట్ట నుంచి శివయ్య స్తూపం సెంటర్ మీదుగా చెక్‌పోస్టు వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సత్యకృష్ణ, ఎన్.శ్రీనివాసరావు, ఎల్.శ్రీనివాసరావు, వి.లింగమూర్తి, సాహెబ్, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలుచోట్ల శ్రీరామ నవమి వేడుకలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

జిల్లాలోని పలుచోట్ల శ్రీరామానవమి వేడుకలు నిర్వహించారు. సత్తెనపల్లిలోని కట్టావారివీధిలో కొలువై ఉన్న కోదండిరామి స్వామి దేవాలయం వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో వేడుకల్లో పాల్గొన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బొర్రా వెంకట అప్పారావు సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పిస్తుచారు.



పల్నాడులో దాహం కేకలు

(మొదటి పేజీ తరువాయి)

రోజులకొకసారి నీరిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు సాగర్ కుడి కాల్వ ద్వారా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు 5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఈ నీటితో పల్నాడు జిల్లాలోని 135 తాగునీటి చెరువులను నింపేందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సంయుక్త కార్యాచరణతో ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు చెబుతున్నారు.

మరోవైపు జల్ జీవన్ మిషన్ పనులు కూడా నత్తనడకన నడుస్తున్నాయి. జల్ జీవన్ మిషన్ నిధులు కింద పల్నాడు జిల్లాకు రూ.508 కోట్లు కేటాయించారు. పనులు ఇప్పటికీ 30 శాతమే పూర్తవ్వగా మరో 30 శాతం పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఐదారు నెలలుగా ప్రభుత్వ పరంగా కల్పించాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పనులే కదలడం లేదు. పనులు చేసినా ఎన్నికల నేపథ్యంలో బిల్లులు మంజూరవుతాయో? లేదో? అనే సందేహంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. 2025 ఆరంభం నాటికి జల్ జీవన్ పనులు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నా సాధ్యాసాధ్యాలపై అనుమానాలు నెలకొన్నాయి.

గోదావరి నది నుండి సముద్రంలో కలిసే నీటిని ఒడిసి పట్టాలనే ఉద్దేశంతో గత టిడిపి ప్రభుత్వ హయాంలో గోదావరి- పెన్నా నదుల అనుసంధానించే ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని నకరికల్లు వద్ద రూ.6020 కోట్లతో మొదటి దశ పనులు చేపట్టాలని ఎత్తిపోతల పథకానికి అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు 2018 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 9.60 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగు నీరు అందుతుందని ప్రకటించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఈ పథకాన్ని పక్కనపెట్టింది. వైసిపి గత ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన వరికపూడిసెల ఇప్పటికీ రాజకీయ లబ్ధికి శంకుస్థాపనలకే పరిమితమైంది. వీటన్నింటి నేపథ్యంలో పల్నాట దాహం కేకలు మిన్నంటుతున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు.

ఇండియా వేదిక తరపున నేడు కాంగ్రెస్ అభ్యర్థి నాగేశ్వరరావు నామినేషన్

ప్రజాశక్తి - పెదకూరపాడు



ఇండియా వేదిక తరపున పెకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పమిడి నాగేశ్వరరావు గురువారం నామినేషన్ వేయనున్నారు. సిపిఎం, సిపిఐ మద్దతుతో పోటీ చేస్తున్న ఆయన మండలంలోని బొలుసుపాడు నుండి పెదకూరపాడు వరకు ర్యాలీ వచ్చి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్, వామపక్ష శ్రేణులు తరలిరావాలని నాగేశ్వరరావు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చిలకలూరిపేట : పట్టణ పరిధిలో గల చిలకలూరిపేట-2 పరిధిలో పండరీపురంలో గల వాటర్ ట్యాంకులు, సుగాలి కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మతు నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా ఉండదని డి.ఈ.ఈ. ఆర్.అశోక్ కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.


కొల్లా వెంకయ్య విగ్రహం వద్ద నివాళు విమలక్క

పెదనందిపాడుకు విమలక్క ప్రజాచైతన్య యాత్ర

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజా చైతన్య యాత్రలో భాగంగా అరుణోదయ సాంస్కృతిక విభాగ, రెండు తెలుగు రాష్ట్రాల చైర్మన్, ప్రజా గాయని విమలక్క ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర ఈరోజు పెదనందిపాడుకు చేరుకుంది. పాత బస్టాండ్ సెంటర్‌లోని కొల్లా వెంకయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, నిజమైన ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నాయని, రాజధానిలేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేశారని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి వంత పాడుతున్నాయని విమర్శించారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం యత్నిస్తోందన్నారు. కార్పొరేట్లకు రూ.వేలకోట్లు రాయితీలిస్తూ కార్మిక, రైతుల ప్రయోజనాలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ ప్రజా చైతన్య యాత్రను నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కొల్లా అమర్, కొల్లా రామన్, బోడావుల హనుమంతరావు పాల్గొన్నారు.

హోటల్ నిర్వాహకులకు బెదిరింపు ఫోన్ కాల్స్

పోలీసులకు ఫిర్యాదు చేసిన అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - తెనాలి

ఫుడ్ సేఫ్టీ అధికారినంటూ హోటల్స్ యాజమా న్యాలకు ఫోన్లు చేసి బెదిరిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెనాలి హోటల్స్ అండ్ ఫుడ్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం బుధవారం పట్టణ టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అసోసియేషన్ అధ్యక్షులు కనికచర్ల రమాకాంత్ మాట్లాడుతూ శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి హోటల్ నిర్వాహకులకు ఫోన్లు చేసి, హోటల్ పై ఫిర్యాదులు ఉన్నాయని రూ 10వేలు పంపితే రిజిస్ట్రేషన్ వగైరా పూర్తి చేసి సర్టిఫికెట్ పంపుతామని, లేని పక్షంలో రూ 25వేల అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని, పైగా జైలు శిక్ష కూడా ఉంటుందని బెదిరిస్తున్నారన్నారు. డబ్బును 99853 87372 నంబర్‌కు పంపించాల్సిందిగా కోరుతున్నాడని చెప్పారు. ఫోన్లో డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరిం పులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఈదర వెంకట పూర్ణచంద్, తోటకూర సుబ్రహ్మణ్యం, కె కొండారెడ్డి, బి సతీష్ రెడ్డి, ఎం సుధీర్ బాబు, జి శివప్రసాద్, ఎ సురేష్, ఎ రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న హోటల్స్ అసోసియేషన్ సభ్యులు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న అన్నా నందకిషోర్

శ్రీమేధ ఆధ్వర్యంలో శ్రీరామనవమి

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీరామనవమి సందర్భంగా శ్రీమేధ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. కొత్తపేట లక్ష్మీభవన్ క్యాంపస్ నుండి ప్రారంభమైన ఈశోభాయాత్ర గౌడీయమఠం, పాతబస్టాండ్, జిన్నాటవర్ సెంటర్, వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం, నాజ్ సెంటర్ మీదుగా తిరిగి క్యాంపస్ వరకూ ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా శ్రీమేధ విద్యాసంస్థల డైరెక్టర్ అన్నా నందకిషోర్ శ్రీరాముడి జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతి స్వామి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపునకు మైనారిటీ ఓట్లు కీలకం : ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలిరూరల్



స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ముస్లిం మైనారిటీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం మైనారిటీల ఓట్లు చాలా కీలకమన్నారు. ఎన్డీయే అభ్యర్థుల విజయానికి మైనారిటీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా కృషి చేయాలన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయానికి తమవంతు కషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఖుద్దూస్, నాసర్, ఖలీల్, జాని, ఖర్జూర సుభానీ, ఇర్ఫాన్, మొయిన్ ఖాన్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నా లక్ష్మీనారాయణకు పెన్షనర్స్ అసోసియేషన్ మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సత్తెనపల్లి టిడిపి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు మద్దతు తెలిపారు. ఈమేరకు గుంటూరులోని ఆయన నివాసంలో కన్నా లక్ష్మీనారాయణను అసోసియేషన్ నాయకులు, మాజీ ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు జి.పూర్ణచంద్రరావు, తదితరులు కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గురవయ్య, ఆలిండియా పెన్షనర్స్ ఫెడరేషన్ కార్యదర్శి పి.నాగరాజు, మాజీ ఎన్‌జిఒ ఉపాధ్యక్షులు విజ్ఞమ్ చౌదరి, జిల్లా నాయకులు టి.శ్రీనివాసరావు, ఎం.వి.సుబ్బారావు, సాయిబాబు, సిహెచ్.వెంకటేశ్వర్లు, నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కన్నాను కలిసిన అసోసియేషన్ నాయకులు

ముద్రాపకుడు, ప్రచురణకర్త వివరాలు ప్రింట్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ప్రచారం కోసం ప్రచురించే కరపత్రాలు, పోస్టర్లపై తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణకర్త వివరాలు చిరునామాతో సహా ప్రింట్ చేయాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ప్రచార కరపత్రాలు, పోస్టర్లలో కేంద్ర ఎన్నికల సంఘం ఆర్‌పి చట్టం-1951లోని సెక్షన్ 127ఎ ప్రకారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు తప్పనిసరిగా ప్రింటర్, పబ్లిషర్స్ చిరునామా, పేరు స్పష్టంగా ప్రింట్ చేయించాలన్నారు. కనుక నిబంధనను పాటించాలని స్పష్ట చేశారు.



మాదిపాడులో భారీగా తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - అచ్చంపేట : మండల పరిధిలోని మాదిపాడు శివారులో బుధవారం భారీ మొత్తంలో తెలంగాణ మద్యం పట్టుబడింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండు రాష్ట్రాల సరిహద్దు అయిన మాదిపాడు గ్రామంలో మద్యం అక్రమ నిల్వలపై ఉన్నత అధికారులకు సమాచారం వెళ్ళింది. ఈ క్రమంలో పల్నాడు జిల్లా ఎస్పీ, ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు మాదిపాడు లో తనిఖీలు నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని కుంటిమద్ది గ్రామంలోని ఓ నివాస గృహంలో మద్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా క్రోసూర్ ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన 72 కేసులు (3456 బాటిల్స్) వాటి విలువ సుమారు రూ.4 లక్షల 50 వేలుఉంటుందని అధికారులు చెప్పారు. మాదిపాడు గ్రామానికి చెందిన ఎస్.కె అబ్దుల్ సత్తార్‌ను అరెస్టు చేసినట్లుగా తెలిపారు. మరో వ్యక్తి సద్దాం హుస్సేన్ సంబంధం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

లారీ కొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నకరికల్లు ఎస్సీ కాలనీకి చెందిన వర్ల మరియబాబు (40) ఐస్ క్రీమ్ బండి నడుపుతూ జీవనం కొనసాగిస్తుంటాడు. శ్రీరాంపురం రెడ్డి బిర్యాని పాయింట్ వద్ద ఐస్ క్రీమ్ బండి తీసుకొని నకరికల్లు వస్తుండగా పిడుగురాళ్ల నుండి మిర్చి లోడుతున్న వెళుతున్న లారీ మరియ బాబు ను డీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) గారి కోర్టులో

CC No.82/2018

Between:-
Sri Shaik Adam Vali, ...Complainant
Vs
Sri Tedla Ravindra Nadh ...Accused
To
ప్రతివాది:-
Sri Tedla Ravindra Nadh,
S/o Chandra Sekhara Rao,
R/o Door No. 11-6-1-107, Navodaya Naga
Narasaraopet Town & Mandal,
Palnadu District, (Old Guntur District)

నిందితుడైన వ్యక్తి హాజరు కోరుతూ ప్రకటన సెక్షన్ 82 Cr.P.C చూడండి

నిందితుడు అయిన వ్యక్తి తెడ్ల రవీంద్ర నాథ్, తండ్రి చంద్ర శేఖర రావు, నివాసము డోర్ నెంబరు 11-6-1/107, నవోదయ నగర్, నరసరావుపేట-522601, పల్నాడుజిల్లా,ఆంధ్రప్రదేశ్, వారి పైన మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో NI act చట్టంలోని సెక్షన్ 138 క్రింద CC No.82/2018, ప్రకారం నమోదు అయిన కేసులో నేరానికి పాల్పడినట్లు (లేదా పాల్పడినట్లు అనుమానించబడ్డారని) నా సమక్షంలో ఫిర్యాదు చేయబడింది, మరియు సదరు నిందితుడైన తెడ్ల రవీంద్ర నాథ్ ఆచూకీ తెలియనందున అరెస్టు వారెంటు జారీ చేయబడింది మరియు అది తిరిగి వచ్చినందున సదరు నిందితుడు తెడ్ల రవీంద్ర నాథ్ పరారీలో ఉన్నారని (లేదా సదరు వారెంటు సర్వీసు అందుకోకుండా తనకు తాను దాగి ఉన్నారని) నా సంతృప్తి మేరకు తెలియపరచడమైనది. మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో NI act చట్టంలోని సెక్షన్ 138 క్రింద CC No.82/2018 ప్రకారం నమోదు అయిన కేసులో నిందితుడు అయిన తెడ్ల రవీంద్ర నాథ్ సదరు ఫిర్యాదుకు సంబంధించి జవాబు చెప్పేందుకు ఈ కోర్టు సమక్షంలో 16-05-2024న లేదా ఆలోగా హాజరు కావాలని ఇందుమూలముగా ప్రకటించడమైనది.

ఉత్తర్వు ద్వారా మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, చిలకలూరిపేట.

స్థలం:- నరసరావుపేట
తేదీ:18-04-2024.

తెలప్రోలులో తెనాలి ఎమ్మెల్యే రోడ్ షో

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ బుధవారం తేలప్రోలు గ్రామంలో పర్యటించారు. తేలప్రోలు డ్యామ్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో కంచర్లపాలెం, సోమ సుందరపాలెం మీదుగా నేలపాడు గ్రామం వరకు నిర్వహించారు. ఎంపిపి ధర్మరాజుల చెన్నకేశవులు, జెడ్పిటిసి పిల్లి ఉమా ప్రణతి, తెల్లప్రోలు సర్పంచ్ షేక్ బాషా, ఎంపిటిసి షేక్ ఇలియాజ్, పార్టీ నాయకులు పాల్గొని ఫ్యాన్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి వైసిపిను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నేడు బిసివై అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో బాగంగా మొదటి రోజు ప్రత్తిపాడు నియోజకవర్గంలో అసెంబ్లీ నుంచి భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా ఎస్.ఎస్.రాణి (మహాలక్ష్మి) నామినేషన్ వేస్తున్నట్లు ఆమె తెలిపింది. నియోజకవర్గంలోని బిసివై పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజలు, నామినేషన్ వేసె క్రమంలో భారీగా ప్రజలు పాల్గొంటారని అభ్యర్థి తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమం

పొన్నూరులో నరేంద్రకుమార్ ప్రచారం

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

స్థానిక పట్టణంలోని 20, 21 వార్డులలో బుధవారం పొన్నూరు టిడిపి అసెంబ్లీ అభ్యర్థి నరేంద్ర కుమార్ తెలుగుదేశం-జనసేన-బిజెపి ప్రకటించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, అండ్ బాబు సూపర్ 6 లోని సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. మహిళలకు, యువతకు ప్రజలకు తెలియజేస్తూ, వార్డులోని ప్రజల సమస్యలను నరేంద్ర కుమార్, పొన్నూరు జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయులు బాబు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ కులాయిలు ఉన్న ఉపయోగం లేదని నీళ్లు సరిగా రావడం లేదని, ట్యాపులు సరిగా లేకపోవడం వలన నీరు బాగా వృధా అవుతున్నాయని, త్వరగా మాకు నీటి సమస్య అనేది లేకుండా చూడాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ధూళిపాళ్ల అధికారం మహిళలు ధూళిపాళ్లకు హారతులు పట్టి నీరాజనాలు పలికారు. వార్డులో టిడిపి కార్యకర్తలు నరేంద్ర కుమార్ ను ఘనంగా సత్కరించారు.

డాక్యుమెంట్లు పోయినవి

ఉస్తేలమూరి బాలకృష్ణారెడ్డి S/o చెన్నారెడ్డి, వయస్సు 67 సం॥లు, నివాసం రావిపాడు రోడ్డు, చెక్‌పోస్టు వద్ద, నరసరావుపేట టౌన్, పల్నాడుజిల్లా అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నేను ది. 13-04-2024న నాకు చెందిన రిజిష్టర్ డాక్యుమెంటు నెం.9373/2011ను, దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు నెం. 11150/2010 ఒరిజినల్ డాక్యుమెంట్లును తీసుకొని జిరాక్స్ కాపీ నిమిత్తం కవర్‌లో పెట్టుకొని రావిపాడు రోడ్డులో నుండి బయలుదేరి టీ పాయింటు వద్ద బండి పెట్టగా బండికి తగిలించిన కవర్ పోయినది. సదరు పై డాక్యుమెంట్లు ఉన్న కవర్ ఆచూకి తెలిసిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు.

ఉస్తేలమూరి బాలకృష్ణారెడ్డి,
రావిపాడురోడ్డు, చెక్‌పోస్టు వద్ద, నరసరావుపేట.
సెల్ : 9640311455.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

'నారీ గళం' సమావేశంలో పెమ్మసాని

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి : మహిళాశక్తిని మహాశక్తిగా గుర్తించి రాజకీయ అవకాశాలు కల్పించిన ఎన్టీఆర్ లాగా మహిళలకు రాజకీయంగా భద్రత కల్పించాలంటే పొలిటికల్ సెన్సార్‌బోర్డ్ ఉండాలని గుంటూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని స్థానిక సిద్ధార్థ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన 'నారీ గళం' సమావేశానికి ముఖ్య అతిథిగా పెమ్మసాని సతీ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్, చంద్రబాబు మహిళల ఉన్నతికి కృషి చేశారని, అలాంటి నాయకుల తర్వాత వచ్చిన జగన్ మహిళలపై కనీస గౌరవం లేకుండా ప్రవర్తిస్తున్నారని అన్నారు. మహిళలు రాజకీయంగా ఎదగాలని చెబుతూ చదువు, విజ్ఞానం ఉన్నప్పటికీ రాజకీయ శక్తిగా మహిళలను ఉన్నత స్థాయికి చేర్చడానికి సహకరిస్తుందని పేర్కొన్నారు. అందుకుగాను పార్లమెంట్ సాక్షిగా తన సహకారం తాను అందిస్తానని ఆయన చెప్పారు. రాజకీయంగా సోషల్ మీడియాకు ఒక సెన్సార్ బోర్డు ఏర్పాటు చేసినప్పుడే మహిళలు ధైర్యంగా రాజకీయాల్లోకి రాగలర లని పెమ్మసాని తెలిపారు. బిజెపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి ఆన్లైన్ ద్వారా మాట్లాడుతూ నారీ గళం సమావేశం గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. మోదీ ఆధ్వర్యంలో భారతదేశ మూడవ అతి పెద్ద ఆర్థిక దేశంగా ఎదిగిందని చెప్పారు. అభివృద్ధిని పరుగులు పెట్టించే చంద్రబాబు నాయుడు వంటి నాయకుడు, ప్రజా సమస్యలను ప్రశ్నించే ందుకే ఆవిర్భవించిన జనసేన కలిసి ప్రయాణిస్తున్న ఈ కూటమికి ప్రజలు సహకరించి ఎన్నికల్లో విజయం అందించాలని కోరారు. కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి అసెంబ్లీ అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి, మహిళా టిడిపి నాయకురాలు మాగంటి రూప, డాక్టర్ శ్రీ రత్న తదితరులు పాల్గొన్నారు.



కోటప్పకొండ వద్ద సాగవుతున్న గడ్డి

తుంపర సేద్యంతో పశుగ్రాసం పెంపకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బిందు, తుంపర సేద్యం విధానం ద్వారా తక్కువ నీటి వనరులు సద్వినియోగం చేసుకుంటూ రైతు పశుగ్రాసాన్ని పెంచుతున్నారు. నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ వద్ద 75 సెంట్లలో ఈ సాగు చేపట్టారు. ఈ పొలానికి బోరు నీరు పారించి తడపాలంటే వారం రోజులు పడుతుందని, తుంపర సేద్యం విధానంలో రెండ్రోజులకే నీరు అందుతోందని రైతు చెబుతున్నారు.

24 నుండి వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని 24వ తేదీ నుండి నిర్వహిస్తామని శిబిరం ఇన్‌ఛార్జి షేక్ మహమ్మద్ రియాజ్ బుధవారం తెలిపారు. సత్తెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సుగాలీ) క్రీడా మైదానంలో వచ్చేనెల 31 వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరం కొనసాగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు బ్యాచ్‌లు ఉంటాయన్నారు. ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ తదితర క్రీడాంశాల్లో శిక్షణుంటుందని తెలిపారు.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రత్యేక డ్రైవ్ ద్వారా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బుధవారం 5వ వార్డులోని క్రిస్టియన్‌పాలెం పరిసర ప్రాంతాల్లో పనులు చేపట్టారు. పనులను మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి పర్యవేక్షించారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలేమైనా ఉన్నాయా? అని స్థానికులను అడిగారు. సైడు కాల్వల్లోని మురుగు నీరు పారుదల సరిగా లేని కారణంగా రోడ్డుపైకి వస్తోందని, రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని చెప్పారు. కొత్త కాల్వలు నిర్మించాలని కోరారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ కాల్వల నిర్మాణానికి వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని, ఈలోగా నీటి పారుదలకు వీలుగా రెండ్రోజుల్లో కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్రిస్టియన్‌పాలెం మొత్తం కాల్వల్లోని పూడికలను పూర్తిస్థాయిలో తీయిస్తామని, వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తలిస్తామని చెప్పారు. కాల్వలు పాతవి, పాడయినవి కావడంతో మురుగు పారుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయని చెప్పారు. సైడు కాల్వలపై నిర్మాణాలు చేపట్టొద్దని, ర్యాంపులు, మెట్లు వంటివి నిర్మించదలిస్తే వాటి మధ్య ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ స్వర్ణరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, సిపిఎం శ్రేణులు



రొంపిచర్లలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

మోసం చేసిన బిజెపిని, బలపర్చే పార్టీలను ఓడించాలి

- ఇండియా వేదిక అభ్యర్థుల విజయం కోసం పిడుగురాళ్లలో కాంగ్రెస్, సిపిఎం శ్రేణుల ప్రచారం
- రొంపిచర్లలో సిపిఎం సమావేశం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఇండియా వేదిక బలపరిచిన గురజాల నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తియ్యగుర యలమందరెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్, సిపిఎం శ్రేణులు బుధవారం పిడుగురాళ్ల పట్టణంలో శ్రీనివాస్ కాలనీ, బోయ కాలనీ, వడ్డెర కాలనీ, బ్రహ్మానంద రెడ్డి కాలనీ, తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కరపత్రాలు పంచుతూ ఓట్లు అభ్యర్థించారు. అభ్యర్థి యలమందరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా పదేళ్లిస్తామని తిరుపతిలో ప్రకటించిన బిజెపి అనంతరం ప్రజలను నట్టేసిన ముంచిందని అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగాన్ని కాపాడుతుందని, పేదలకు సంక్షేమ బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఆలంబిస్తోందని, కార్పొరేటర్లకు దేశ సంపదను దోచిపెడుతోందని అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల్లో విభజన తెస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపిని, దానితో జతకట్టిన పార్టీలను, తొత్తుగా వ్యవహరించే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ జొన్నలగడ్డ యోహాను మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి మహిళను లక్షాధికారిగా చేసే బాధ్యత తీసుకుంటుందన్నారు. రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీని అమలు చేస్తుందని, ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షలతో ఇల్లు కట్టిస్తుందని, కేజీ టు పీజీ ఉచిత విద్యను అందిస్తుందని వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం తదితర కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గురజాల ఎమ్మెల్యేగా తియ్యగూర యలమందరెడ్డిని, నరసరావుపేట ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి అలెగ్జాండర్ సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.వెంకటేశ్వర్లు, షేక్ బాబు, రామకృష్ణ, శ్రీను, లక్ష్మి, నాగేంద్రం, యోహాన్ హుస్సేన, గోవిందు పాల్గొన్నారు.

మోడీ ఆగడాలు ఆగాలంటే ఎన్‌డిఎను ఓడించాలి

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిధులు, పోలవరం ప్రాజెక్టుకు నిధులివ్వకుండా రాష్ట్ర ప్రజలను బిజెపి మోసం చేసిందని, మరోవైపు మతతత్వాన్ని రెచ్చగొట్టి ఓట్లు వేయించుకోవాలని కుట్రలు పన్నిందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమికి బుద్ధి చెప్పి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. పదేళ్లపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రజలకు చేసిందేమీ లేదని, పైగా పరిస్థితులను మరింత దిగజార్చిందని అన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను దారిమళ్లించడానికి అయోధ్యలో రామమందిరం పేరుతో మత రాజకీయాలు చేస్తోందన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి వ్యవసాయాన్ని సైతం కార్పోరేట్‌లకు కట్టబెట్టేలా కుట్రలు చేసిందని విమర్శించారు. రైతులపై కాల్పులు జరిపించిన హీన చరిత్రను ప్రధాని మోడీ మూటగట్టుకున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికే రాజ్యాంగ విలువలను మంటగలుపుతున్న బిజెపి ఈ సారి గెలిస్తే రాజ్యాంగాన్నే మార్చాలని చూస్తోందని, వారి ఆగడాలను నిలువరించాలంటే ఎన్‌డిఎ కూటమిని ఓడించి ఇండియా వేదిక పార్టీలను గెలిపించాలని కోరారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాట సందర్భంలో రైతులకు మోడీ హామీలిచ్చినా వాటిని అమలు చేయలేదని, ఉపాధి హామీకి నిధులు తగించి ఆ చట్టాన్నే నిర్వీర్యం చేస్తున్నారని, కూలీలకు 100 రోజుల పని కలగా మారిందని విమర్శించారు. కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్పు చేసి కార్మికుల హక్కులను హరించారని, జీఎస్టీలో రాష్ట్రాల పనుల్న వాటాను తగ్గించారని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని, దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ఇన్ని దారుణాలకు పాల్పడుతున్న బిజెపి, దాని మిత్రపక్షాలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కె.రామారావు, బి.నాగేశ్వరరావు, పి.అంజిరెడ్డి, పాపారావు, యాకోబు, సుబ్బారావు, ఖాదర్ మస్తాన్, రామిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు నామినేషన్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఎన్‌డిఎ కూటమి తరుపున ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. నామినేషన్ దాఖలు సందర్భంగా గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం వద్ద నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ ఉంటుందని, ర్యాలీలో టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అరవిందబాబు స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కోరారు.

2019 ఎన్నికల్లో నరసరావుపేట ఎంపీగా వైసిపి తరుపున శ్రీకృష్ణదేవరాయలు పోటీ చేసి టిడిపి అభ్యర్థి అయిన రాయపాటి సాంబశివరావుపై గెలుపొందారు. ప్రస్తుతం ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. పట్టణంలో 30 ఏళ్లకుపైగా వైద్యవృత్తిలో కొనసాగుతున్న అరవిందబాబు మంచి హస్తవాసి కలిగిన వైద్యునిగా పేరు తెచ్చుకున్నారు. 2019లో టిడిపి తరుపున అనూహ్యంగా టిక్కెట్ దక్కించుకున్నా కొన్ని సామాజిక సమీకరణల పొందిక కుదరక ఓటమి పాలయ్యారు. అయినా ఈ ఐదేళ్లు టిడిపిలోనే చురుగ్గా ఉంటూ మరోసారి పోటీకి సిద్ధమయ్యారు.

విశ్వసాయి విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

ఇంటర్‌లో పట్టణంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను విశ్వ సాయి జూనియర్ కళాశాల యాజమాన్యం బుధవారం సత్కరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినుకొండ పట్టణ సిఐ ఎస్.సాంబశివరావు, బిఇడి కళాశాల డైరెక్టర్ గాలి శ్రీనివాసరావు, విశ్రాంత అధ్యాపకులు భాగవతుల రవికుమార్, లక్ష్మయ్య ఐఎ.స్ అకాడమీ డైరెక్టర్ పారా లక్ష్మయ్య పాల్గొన్నారు. ఇంటర్ రెండో సంవత్సరం బైసిపిలో దోసపాటి సాత్విక (982/1000), ఎంపిసిలో కాలేజీ ఫస్ట్ సాధించిన వి.సీతారామశర్మ (971/1000), ఎంఇసిలో టౌన్ ఫస్ట్ సాధించిన ఎం.ప్రవల్లిక (940/1000) ఎంపిసి మొదటి సంవత్సరం కాలేజీ మొదటి స్థానంలో, రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించిన వి.యమునశ్రీ (462/470), రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించిన డి.వైష్ణవి (461/470)తోపాటు మొదటి సంవత్సరంలో 450 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులను సత్కరించారు.





పెట్రోల్ బంక్ లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెట్రోల్ బంకులో సెల్‌ఫోన్ వాడొద్దు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి ఎంవి సుబ్బారావు వాహనదారులకు, నిర్వాహకులకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో శ్యామ్ సుందర్ పెట్రోల్ బంక్‌లో బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరించారు. పెట్రోల్ బంకుల్లో సెల్‌ఫోన్లు వాడొద్దని చెప్పారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ యజమాని రాజశేఖర్, మేనేజర్ శ్రీనివాసరావు, అగ్నిమాపక కేంద్ర సిబ్బంది లీడింగ్ ఫైర్‌మన్ షేక్ గౌస్, ఆర్.హుస్సేన్, ఫైర్‌మన్‌లు కె.శ్రీనివాసరావు, సుభాని, మహేంద్రరెడ్డి, గోవిందు, డ్రైవర్ ఆపరేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

బిజెపి మిత్రులను, తొత్తుపార్టీలను ఓడించండి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

తాడేపల్లిలో సిపిఎం, సిపిఐ అభ్యర్థుల పాదయాత్ర

ప్రజాశక్తి-తాడేపల్లి

బిజెపితో అంటకాగతున్న మిత్రులు, దాని లోపాయ కారి మద్దతు ఇస్తున్న తొత్తు పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. 43 పార్టీలతో ఏర్పడిన ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తాడేపల్లిలో ఇండియా వేదిక బలపరిచిన అభ్యర్థులు మంగళగిరి సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్నా శివశంకరరావు, గుంటూరు పార్లమెంట్‌కు సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్‌లను సుత్తి కొడవలి నక్షత్రం, కంకి కొడవలి గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సిపిఎం, సిపిఐ అభ్యర్థులు బుధవారం తాడేపల్లిలోని నులకపేట సుందరయ్య ప్రెస్‌కాలనీ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల పేదలు మరింత పేదలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోటీశ్వర్లు శత కోటీశ్వర్లు అవుతున్నారని, అందుకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా వారికి కట్టబెడుతున్నారని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి ఈ పది సంవత్సరాల కాలంలో ఉద్యోగాలు ఇవ్వకపోగా 25 కోట్ల మంది నిరుద్యోగులను పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివి ప్రతి ఏటా రెండు కోట్ల మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా భర్తీ చేయాల్సిన 7.5 లక్షల పోస్టులను భర్తీ చేయడంలేదని మండిపడ్డారు. కమ్యూనిస్టు పార్టీలను గెలిపించడం ద్వారా అభివృద్ధికి చిరునామాగా ఈ ప్రాంతాన్ని నిలపాలని కోరారు. మాజీ సిఎం చంద్రబాబునాయుడు తాత్కాలిక రాజధానుల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపించారని ఎద్దేవా చేశారు. గ్రాఫిక్స్‌తోనే ఐదు సంవత్సరాల కాలం గడిపి అధికారం కోల్పోయారన్నారు. అధికారంలోకి వచ్చిన జగన్ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రంలో తిరోగమనంలో నడిపారని విమర్శించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఎపిని చేసింది వైసిపి, టిడిపి కాదా అని ప్రశ్నించారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా అంటూ దేశాన్ని అల్లకల్లోలంలోకి నెట్టివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతవాద రాజకీయాలకు తోడు మితవాద రాజకీయలు తోడై దేశాన్ని, రాష్ట్రాలను సర్వ నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ మోడీ వస్తే ఎన్నికలు ఉంటాయో లేదోనని అనుమానం వ్యక్తం చేశారు. మంగలగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు మాట్లాడుతున్న వేములపల్లి శ్రీకృష్ణ, నిమ్మగడ్డ రామ్మోహనరావు లాంటి ఆదర్శనీయులు ఏలిన మంగలగిరిలో వామపక్షాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. పెట్రోల్, డీజిల్ నిత్యావసరాల సరుకుల ధరలు పెరుగుదలకు కారణమైన బిజెపి, దాని మిత్రులను ఓడించాలని పిలుపునిచ్చారు. గగుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మంగలగిరి ప్రాంతంలో కమ్యూనిస్టుల కృషితో 40 కాలనీలు ఏర్పడ్డా యని తెలిపారు. పేదల కోసం నిలబడి పని చేసే కమ్యూనిస్టు పార్టీలకు ఓటు వేయాలని కోరారు. డబ్బు సంచులతో వచ్చే వారిని తిరస్కరించాలని చెప్పారు.

కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సూర్యారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ, నాయకులు డివి భాస్కరరెడ్డి, ఎం శ్రీనివాసరెడ్డి, సిపిఎం నాయకలు దొంతిరెడ్డి వెంకటడ్డి, దర్శనపు సామ్యేలు, కొట్టె కరుణాకరరావు, డి.శ్రీనివాసకుమారి, ఎస్.గిరిజ, ఎ.శౌరిబర్తులం, నరసింహారావు, డి.చినదుర్గారావు, ఎస్.బాష, సిహెచ్.సుశీల, ఎం.తులసమ్మ, ఎం.మల్లేశ్వరి, కె.బాబూరావు, ఫిరోజ్, కె.మేరి, శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు దర్శనపు సామ్యేలు, సిపిఐ నాయకులు చినతిరుపతయ్య, ఎ ం.హనుమంతరావు, జె.చైతన్య, ఎ.కిరణ్‌కుమార్, జాన్‌బాబు, టి.వెంకటయ్య, ఎం.డాంగే, ఎస్‌కె బాష పాల్గొన్నారు.

అభ్యర్థులకు ఘన స్వాగతం


ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం మంగలగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరావు, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌లకు బుధవారం నులకపేట సుందరయ్య ప్రెస్ కాలనీ నుంచి ప్రారంభమైన పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లభించింది. హారతులు పట్టారు. పూలదండలు వేశారు. పూలు జల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రెస్‌కాలనీ నుంచి ఎమ్మెల రామయ్య కాలనీ, జగ్జీగన్‌రావుకాలనీ, వడ్డెర కాలనీప్రాంతాల మీదుగా ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్, బ్రహ్మానందపురం తదితర ప్రాంతాల్లో పాదయాత్ర జరిగింది. వివిధ కూడళ్లలో నాయకులు మాట్లాడారు. సాయంత్రం తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్, కొత్తూరు, అంజిరెడ్డి కాలని, మల్లారెడ్డి నగర్, క్రిస్టియన్ పేట ప్రాంతాల్లో పర్యటించారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న జొన్న శివశంకరరావును గెలిపించాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎర్రబాలెంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎం.రవి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 20వేల మంది పేదలతో ప్రభుత్వ భూములు ఆక్రమింప చేసి, పేదలతో ఇల్లు వేయించి నిలబెట్టిన ఘనత సిపిఎం కే దక్కుతుందని అన్నారు. అప్పటి ,ఇప్పటి పాలకులు ఏదో ఒక వంకతో పేదల ఇళ్లను కూల్చి నిలువ నీడ లేకుండా చేశారు తప్ప వారికి పట్టా లు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. నేడు పేదల పైన వల్లమాలిన ప్రేమ వలకబోస్తూ పట్టాలిస్తామంటూ ఉత్తుత వాగ్దానాలు చేస్తున్నారని అన్నారు. పేదలు కష్టాల్లో ఉన్నప్పుడు కనుచూపుమేరలో కనపడని వారికి సరైన గుణపాఠం చెప్పి నిత్యం పేదలను అంటి పెట్టుకొని వారి సమస్యల పరిష్కారం కొరకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా నిలబడి పోరాడే కమ్యూనిస్టులకు ఓటు వేస్తేనే ఆ ఓటుకు విలువ ఉంటుందని రవి అన్నారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్, సిపిఐ ,ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరిచిన మంగళగిరి శాసనసభ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు ను గెలిపించాలని కోరుతూ ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెం పూడిలో సిపిఎం శ్రేణులు విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు బి ముత్యాలరావు మాట్లాడుతూ స్థానికంగా పేదల సమస్య పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థి జొన్న శివశంకరరావును సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై, గుంటూరు పార్లమెంటు సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌ను కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు నల్లపు కిషోర్ బాబు, కంచర్ల సాంబశివరావు, పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు స్వాగతం పలుకుతున్న ప్రజలు



ప్రచారంలో జంగాల అజయ్‌కుమార్, జొన్నా శివశంకర్



ఎర్రబాలెంలో మాట్లాడుతున్న ఎం రవి

అశ్రు నయనాలతో కోటయ్య అంతిమ యాత్ర

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

సిపిఎం సీనియర్ నాయకులు, ఈమని గ్రామ కమిటీ కార్యదర్శి, కౌలు రైతు సంఘం నాయకులు కొండూరి కోటయ్య నిష్కల్మష కమ్యూనిష్టని, నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడ్డారని, ఒడిదుడుకులు ఎదురైనా ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేశారని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. గుండెపోటుతో హఠాన్మరణం చెందిన కొండూరి కోటయ్య(ఈమని కోటయ్య) సంతాప సభ బుధవారం ఈమని దళితవాడ సెంటర్లో జరిగింది. సీనియర్ జర్నలిస్టు వి.సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో అత్యధికంగా ఉన్న కౌలు రైతుల సమస్యలపై నిరంతరం పోరాడారని తెలిపారు. వారికి సంబంధించిన సమస్యలపై ఎప్పటి కప్పుడు వినతిపత్రాలు తీసుకొచ్చేవారని, పెద్దగా చదువు కోకపోయినా ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పరిశీలన చేస్తూ ఉండేవారని తెలిపారు. ఇళ్లస్థలాల విషయంలోనూ ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ వల్లభనేని సాంబశివరావు స్ఫూర్తితో ఉద్యమంలోకి వచ్చిన కోటయ్య పార్టీని నమ్మి సిద్ధాంతాల కోసం నిరంతరం పాటుపడ్డారని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కోటయ్య మరణం దుగ్గిరాల మండల పార్టీ ఉద్యమానికి తీరనిలోటని అన్నారు. పార్టీ ఇచ్చే పిలుపుల్లో ఖచ్చితంగా పాల్గొనేవారని, ఎప్పుడూ ప్రజలకు సంబంధించిన ఏదో ఒకసమస్యపై నిరంతరం అర్జీలు తీసుకొచ్చేవారని తెలిపారు. ముఖ్యంగా కౌలు రైతులు, డప్పుకళాకారులు, పెన్షనర్లు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఇలా అన్ని రంగాల సమస్యలపై కోటయ్య నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ పట్ల అత్యంత నిబద్ధతతో వ్యవహరించారని, ఆయనలేనిలోటు పూడ్చలేనిదని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు అంచె మారుతీ వరప్రసాదు మాట్లాడుతూ తమ పార్టీలు వేరైనా ఏదో ఒక సమస్యను మా దగ్గరకు తీసుకొచ్చేవారని, నిరంతరం పేద ప్రజల అభ్యున్నతికోసం పనిచేశారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన వి.సురేష్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల కమ్యూనిస్టు జీవితంలో కోటయ్య ధన్యుడని తెలిపారు. నమ్మిన సిద్ధాంతాన్ని ఖచ్చితంగా ఆచరించి పదిమందికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ముఖ్యంగా దళితుల ఇళ్లస్థలాల సమస్యపై ఆయన చేసిన పోరాటం ఈమని గ్రామ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. సిపిఎం దుగ్గిరాల మండల కమిటీ సభ్యులు బుస్సా చిరంజీవి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ముందుకు తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయడంలో కోటయ్య ఆదర్శంగా నిలిచారని తెలిపారు. సిపిఎం కొల్లూరు నాయకులు బొనిగల అగస్టీన్, దుగ్గిరాల మండల కమిటీ సభ్యులు యేమినేని స్టాలిన్, గ్రామ సర్పంచ్ భర్త ఎస్.కోటేశ్వరరావు కోటయ్యతో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, తెనాలి డివిజన్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి, సిపిఎం మండల కమిటీ సభ్యులు వై.బ్రహ్మేశ్వరరావు, ఎన్.యోగేశ్వరరావు, స్థానిక నాయకులు బాబూరావు, బుల్లి ప్రసాదు, పెద్దలు బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు

కొండూరి కోటయ్య అంతిమయాత్రకు తెనాలి ప్రాంత సిపిఎం నాయకులు, స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. కోటయ్య స్వగృహం నుండి బయలుదేరిన యాత్ర దళితవాడలో నుండి ఆర్‌సిఎం చర్చి మీదుగా సాగింది. వందలమంది ప్రజలు అంతిమయాత్ర చివరవరకూ వచ్చి నివాళులర్పించారు.



కోటయ్య అంతిమ యాత్రలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు



అంబేద్కర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్త చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పుపై దళిత సంఘాల హర్షం

ప్రజాశక్తి-గుంటూరు : శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులను దోషిగా ఎసీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు నిర్ధారించటం పట్ల బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రకాష్ మాట్లాడుతూ తోట త్రిమూర్తులను రాజకీయ బహిష్కరణ చేయాలని, తనకు సహకరించిన 9 మంది ముద్దా యిలను రాష్ట్ర బహిష్కరణ చేయాలని, ఆత్మగౌర వంతో సాక్ష్యం చెప్పిన సాక్షులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. న్యాయవాది వైకె మాట్లాడుతూ త్రిమూర్తులు 28 ఏళ్ల క్రితం సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేవిధంగా ఐదుగురు దళితుల్ని హింసించి, ఇద్దరికి శిరోముండనం చేసిన ముద్దాయి త్రిమూ ర్తులు, తనకు సహకరించిన 9 మందికి విశాఖ ఎస్సీ, ఎస్టీ కోర్టు 18 నెలల శిక్ష, రూ.2.5 లక్షల జరిమాన విధిం చిందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శిఖ సురేష్, కాకి నాగేశ్వరరావు, సాదు మాల్యాద్రి, పాల్గొన్నారు.

శిరోముండనం కేసు తీర్పుపై కెవిపిఎస్ హర్షం

ప్రజాశక్తి - మంగళగిరి : శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులను దోషిగా ఎస్సీ, ఎస్టి ప్రత్యేక కోర్టు నిర్ధారించడం పట్ల కెవిపిఎస్ మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 28 సంవత్సరాల క్రితం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా జరిగిన ఈ అనాగరిక దాడిపై తీర్పు ఇంత ఆలస్యంగా వచ్చిందంటే దళితుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వైసీపీ నుంచి తోట త్రిమూ ర్తులను సస్పెండ్ చేయాలని కోరారు. టిడిపి, వైసిపి పార్టీలు దళితుల విషయంలో ఒక్కటేనని అన్నారు. రానున్న ఎన్నికల్లో దళితుల కోసం పనిచేసే వామపక్ష ప్రజాతంత్ర అభ్యర్థులను గెలిపించు కోవాలని కోరారు.

గుంటూరులో జంగాల గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

ఇండియా బ్లాక్ మద్దతుతో గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గానికి పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ గెలుపు కోరుతూ సిపియం, సిపిఐ ఆధ్వర్యంలో బుధ వారం గుజ్జనగుండ్ల, ఉద్యోగ నగర్, నేతాజి నగర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. అజయ్‌కుమార్‌కు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాయకులు ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌తోపాటు, సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సిపిఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, సిపియం నాయకులు కె.శ్రీనివాసరావు, ఆది నికల్సన్, కాశింవలి, బి.సత్యనారాయణ, ఎస్.కె.బాషా, షేక్.షకీలా, సిపిఐ నాయకులు మేడా హనుమంతరావు, అరుణ్‌కుమార్, నాసర్‌జీ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో జంగాల అజయ్‌కుమార్ తదితరులు

నేడు నారా లోకేష్ నామినేషన్

ప్రజాశక్తి-తాడేపల్లి : మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థిగా టిడిపి, జనసేన, బిజెపి బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి నారా లోకేష్ గురువారం మంగళగిరిలో నామినేషనున్నారని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ బుధవారం తాడేపల్లి టిడిపి కార్యాలయంలో తెలిపారు. లోకేష్ నామినేషన్‌కు నియోజకవర్గం నుండి టిడిపి నాయకులు, కార్య కర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

ప్రజాశక్తి మంగళగిరి : గురువారం 9.30 గంటలకు పాత మంగళగిరి సీతారామ కోవెల వద్ద సర్వమత ప్రార్థనలతో కూటమి కార్యకర్తలు, అభిమానుల నడుమ భారీ ర్యాలీగా ర్యాలీగా కూటమినేతలు బయలుదేరతారు. మంగళగిరి టిడిపి సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు మధ్యాహ్నం 2. 34 గంట లకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లుగా పార్టీ వర్గాలు తెలిపాయి.



చెరువును పరిశీలిస్తున్న కావటి మనోహర్ నాయుడు

'మతి భ్రమించి పుల్లారావు మాటలు'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నాగార్జున సాగర్ నుండి పట్టణంలోని చెరువులకు వస్తున్న నీటిని వైసిపి చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక తాగునీటికి జనం ఇబ్బంది పడ్డ దాఖలాల్లేవన్నారు. తాగునీటి చెరువులను చూసిన పత్తిపాటి పుల్లారావు మతిభ్రమించి మాట్లాడుతున్నారేగాని ఆయన ఆరోపణల్లో నిజం లేదన్నారు. పుల్లారావు మంత్రిగా ఉన్నప్పుడు పట్టణ ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడ్డారని, రెండు మూడ్రోజులకోసారి కూడా నీరు సరఫరా చేయని సందర్భాలున్నాయని విమర్శించారు. తనతోపాటు వైసిపి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ స్థానికుడు కాదంటూ పుల్లారావు విమర్శిస్తున్నారని, అసలు పుల్లారావు ఎక్కడి నుంచి వచ్చారో గుర్తు చేసుకోవాలని అన్నారు. స్థానికంగా తాము, రాష్ట్రంలో వైసిపి గెలవడం ఖాయమన్నారు. ఆయన వెంటన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైసిపి నాయకులు ఉన్నారు.



సామాన్యులకు ఆర్టీసీని భారం చేసిన జగన్ : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అందుబాటు ధరలో ప్రజా రవాణను అందించే బస్సు ప్రయాణాన్ని ప్రజలకు దూరం చేసిన పెత్తందారు జగన్ అని, మూడుసార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.2 వేల కోట్ల భారం వేశారని ఎన్‌డిఎ కూటమి చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని 36, 37 వార్డుల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామాలకు నడిచే అనేక ఆర్టీసీ సర్వీసులను రద్దు చేశారని, ప్రైవేటు రవాణాపై ఆధారపడేలా చేశారని విమర్శించారు. ఈ కారణంగా పేద, మధ్య తరగతి వర్గాల నెలవారీ ఖర్చులు గణనీయంగా పెరిగాయన్నారు. తనను గెలిపిస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానమన్నారు.

ముగిసిన వీరాంజనేయుని ఉత్సవాలు

ప్రజాశక్తి - కారంపూడి

స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయం ఎదురు గల సాయిబాబా గుడిలో గల వీరాంజనేయుని తొమ్మిది రోజుల ఉత్సవాలు ముగిశాయి. 70 సంవత్సరాల నుండి ఇంత ఘనంగా ఈ



ఉత్సవాలు జరగలేదని, దేవాలయం మహిళా మండలి అధ్యక్షులు కోట లక్ష్మి సుజాత అన్నారు. తొమ్మిది రోజులపాటు రోజూకొక అలంకరణతో ఉత్సవాలు నిర్వహించినట్లు చెప్పారు.

హింస, రీపోలింగ్‌కు తావులేకుండా ఎన్నికలు

పటిష్టంగా నిర్వహణకు అన్ని స్థాయిల ఉద్యోగులు, సిబ్బంది సహకరించాలి : పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికలు హింసాత్మక ఘటనలు, రీపోలింగ్‌కు అవకాశమేమీ లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలని పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. 0 శాతం హింస, 0 శాతం రీపోలింగ్‌కు సహకరించాలన్నారు. ఎన్నికల సన్నద్ధతపై ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, మండల, సెక్టార్ అధికారులు, పోలీసు సిబ్బందితో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరూ నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. సి విజిల్ యాప్ అమలులో పల్నాడు జిల్లా ముందు వరుసలో ఉందన్నారు. ఎలక్షన్ సీజన్ మేనేజ్మెంట్ సిస్టంలో తనిఖీల ముమ్మరం చేయాలని, ఎక్కడా అలసత్వం ప్రదర్శించొద్దని చెప్పారు. జిల్లాలో మొత్తం 557 సమస్యాత్మక పోలింగ్



మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన అధికారులు, సిబ్బంది

కేంద్రాలున్నాయని తెలిపారు. పోలింగ్ రోజున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రత్యేక నిఘాని పెట్టాలన్నారు. ఎన్నికల సంఘం ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి, రిటైర్డ్ పోలీస్ అధికారులను బందోబస్తు, క్యూలైన్ మేనేజ్మెంట్ విధులు నిర్వహించుకోవచ్చని తెలిపిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఓటింగ్ మే 5,6,7 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, హోం వోటింగ్‌కు సంబంధించి మే 8,9 తేదీల్లో ఉంటుందని తెలిపారు. 85 ఏళ్ల పైబడిన వారు ముందస్తుగానే పిడబ్ల్యూడిగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే హోం ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని, వారికి 12 -డి ఫారాలు అందించామని తెలిపారు. హోం వ్ ఓటింగ్ ప్రక్రియ పై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ సిబ్బంది పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని చెప్పారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఐడి కార్డు కలిగి ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంగా జేఎన్‌టీయూ కాలేజీని ఎంపిక చేశామని చెప్పారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీలకు ఒకేసారి ఒకే రోజున, ఒకే సమయంలో ఊరేగింపులకు అవకాశం ఇవ్వవద్దని, వీలైనంతవరకు ర్యాలీలను పక్క రోజుకి మార్చుకునేలా చూడాలని చెప్పారు. నామినేషన్ రోజున అవసరమైన మేరకే అభ్యర్థితో పాటు వేరే వారిని లోపలికి పంపించాలన్నారు. పోలింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, అడిషనల్ ఎస్పీ రాఘవేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే వైసిపి గెలవాలి : పిఆర్‌కె

ప్రజాశక్తి-మాచర్ల



సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి వైసిపిని గెలిపించాలని వైసిపి అభ్యర్థి ఎమ్యెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 5, 6, 7 వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిచారు. ఇంటింటికీ తిరిగి వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదని, తిరిగి జగన్ ముఖ్యమంత్రి అయితే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మరుమాముల శ్రీనివాసశర్మ, పిన్నెల్లి వెంకట్రామరెడ్డి, తురకా కిషోర్, పోలా శ్రీను, మస్తాన్ పాల్గొన్నారు.

'రాంబాబు, అనిల్ కుమార్‌పై ఫిర్యాదు చేస్తా'

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు వైసిపి సత్తెనపల్లి ఎమ్మెల్యే, నరసరావుపేట ఎంపీ అభ్యర్థులు అంబటి రాంబాబు, అనిల్ కుమార్ యాదవ్ 'టీ' కప్పులపై సిఎం జగన్, అంబటి రాంబాబు, అనిల్ కుమార్, ఫ్యాన్ ఫొటోలు ముద్రించి 'టీ' దుకాణాలకు పంపిణీ చేస్తున్నారని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని జై భీమ్ భారత్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి జొన్నలగడ్డ విజయ్ కుమార్ చెప్పారు. పట్టణంలోని ఆ పార్టీ



కార్యాలయంలో బుధవారం రాత్రి విజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ప్రలోభాల పర్వానికి వారిరువురూ తెరలేపారని అన్నారు.

వ్యాపార వర్గాలకు అండగా ఉంటా : బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల



అన్ని వర్గాల వ్యాపారులకు అండగా నిలబడతామని మాచర్ల నియోజకవర్గం ఎన్డీఏ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ సెంటర్ రామా టాకీస్ వీధిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టిడిపి హయాంలో వ్యాపార వర్గాలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. వ్యాపారులను పోత్సహించే విధంగా తక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చిన ఘనత టిడిపిదే అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరిగి వ్యక్తిగత రుణాలను అందిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం ముస్లిమ్ మైనార్టీలకు ఎంత మేర చేసిందో దానికి రెండింతలు అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు కట్టించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుంది అన్నారు. ప్రచారంలో కొమ్మెర దుర్గారావు, బాబు ఖాన్, నక్షత్ర ప్రసాద్, జబ్బర్, క్రాంతి కుమార్, నాగూర్ భాష, మైన ఖాజా , రసూల్, మదీన్, లాల, వినోద్, రవి, సుభాని, బద్రు, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నాయి.

వైసిపిని వీడి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పార్టీలో చేరే ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని ఎన్‌డిఎ కూటమి తరుపున మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. విజయపురిసౌత్‌లోని దేశవరపు క్యాంపు తండాకు చెందిన 12 మంది వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి బ్రహ్మారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో పాత్లావత్ నీలియా నాయక్, బాణావత్ రంగ, పాత్లావత్ సైదా, కేతావత్ బాలు, మెగావత్ బాలు, కేతావన్ వెంకటేశ్వర్లు, పరిమియా తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.దారునాయక్, ఎన్.వీరా స్వామి యాదవ్, సాంబశివరావు, బి.వెంకటేశ్వర్లు చౌదరి, రామ్‌చంద్ నాయక్, సైదారావు, ధనుంజయరావు, రాజు పాల్గొన్నారు.

పిఎస్‌వికె చలివేంద్రంలో పానకం పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పిఎస్‌వికె కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని దాతలు వంశీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ షకీలా శ్రీధర్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గద్దె చలమయ్య, ఎ.వెంకట్‌నారాయణ, ప్రజాసంఘాల నాయకులు జి.రజని, జి.ఉమాశ్రీ, పి.వీరేశం, టి.రాము, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



యుపిహెచ్‌సిలో ఒఆర్‌ఎస్ డ్రింక్ కార్నర్

వేసవి ఎండలు తస్మాత్ జాగ్రత్త : డాక్టర్ అనూష

ప్రజాశక్తి - మంగళగిరి

వేసవి ఎండలకు వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ పీ అనూష అన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వేసవిలో వచ్చే వ్యాధులు, లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆమె మీడియాకు వివరించారు. వేసవిలో సాధారణంగా వడదెబ్బ, డీహైడ్రేషన్ వ్యాధులు వస్తాయని, సరైన సమయంలో చికిత్స తీసుకోని ఎడల ప్రాణాంతకం అవుతుందన్నారు. వడదెబ్బకు గురైన వారిలో నీటి శాతం తగ్గి, శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతుందన్నారు. దీంతో గుండె, రక్తనాళాలు, కిడ్నీలు దెబ్బ తింటాయన్నారు. శరీరంలోని



లవణాలు చెమట రూపంలో బయటకు వెళ్లడంతో మనిషి నిరసించి జ్వరము, వాంతులు, విరోచనాలు, తల తిరగడం, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయన్నారు. వడదెబ్బ తగిలిన వారిని వెంటనే నీడలోకి తీసుకువెళ్లాలన్నారు. బట్టలు వదులు చేసి చల్లటి నీటితో శరీరాన్ని తుడిచి శరీర ఉష్ణోగ్రతలు తగ్గేలా చేయాలని, సమస్య తీవ్రతను బట్టి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 5 గంటల వరకు ఎండకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని నీరసంగా ఉంటే ఓఆర్ఎస్, గ్లూకోస్ కలిపిన నీటిని తీసుకోవాలన్నారు. ఇంటిలోనే కాచి చల్లార్చిన లీటర్ నీటిలో అర స్పూన్ సాల్ట్, ఆరు స్పూన్ల షుగర్ వేసి ఓఆర్ఎస్‌ను తయారు చేసుకొని నీరసంగా ఉన్నప్పుడు తాగవచ్చన్నారు. వేపుడు పదార్థాలు టీ, కాఫీ, జంక్ ఫుడ్స్, ఆల్కహాల్ తగ్గించాలన్నారు. పిల్లలకు మెత్తని నూలు దుస్తులు వేసి ద్రవ పదార్థాలు ఎక్కువగా ఇవ్వాలన్నారు. పుచ్చకాయ, కొబ్బరి బొండం, తాటి ముంజలు, కీర దోస వంటివి నీటి శాతం పెంచి అధిక లవణాలను శరీరానికి అందిస్తాయన్నారు. ఎండలోకి వెళ్ళేటప్పుడు తలకు టోపీలు ధరించి, నల్ల దుస్తులకు దూరంగా ఉండాలన్నారు. యూపీహెచ్సీలో ఓఆర్ఎస్ డ్రింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని యూపీహెచ్సీలలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.

సార్వత్రిక ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా ముస్తాబు చేశారు. గతంలో తహశీల్దార్ కార్యాలయమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా ఉండేది. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రంతో పాటు జతచేయాల్సిన ప్రతుల వివరాలతో బోర్డును ఏర్పాటు చేశారు. ఫారం 28 తోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఫారం 26, ఇరోల్ సర్టిఫికేట్, ఫారం ఎ అండ్ బి, కులధృవీకరణ, నగదు డిపాజిట్, ప్రమాణం, ఏజంట్ నియామకానికి సంబంధించిన పత్రం, పోటీ చేస్తున్న అభ్యర్థి, జనరల్ ఏజంట్ నమూనా సంతకాలు, బ్యాలెట్ పేపర్‌లో ముద్రించేందుకు తెలుగు, ఇంగ్లీష్‌లో అభ్యర్థి పేరు, కొత్త బ్యాంక్ ఖాతా వివరాలు, ఆన్‌లైన్‌లో నమోదుకు పుట్టిన తేది, కులం, ఇమెయిల్ ఐడి, మొబైల్ నెంబర్, ఎన్నికల ఏజంట్ పేరు, చిరునామా, సి 3 నామినేషన్‌తో పాటు సమర్పించాలని పొందు పరిచారు. అలాగే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి - పొన్నూరు



సార్వత్రిక ఎన్నికల భాగంగా 18 నుండి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని 88-పొన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి ఏ లక్ష్మీకుమారి తెలిపారు. బుధ వారం ఆర్ఓ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యా లయ పనివేళ్లల్లో ఆదివారం, ప్రభుత్వ సెలవులు దినాల్లో నామినేషన్లు స్వీకరించబడవని తెలిపారు. ఒక్కొక్క అభ్యర్థి ఒకటి నుండి ఐదు సెట్లు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని చెప్పారు. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు ఐదుగురు మాత్రమే లోనికి అనుమతి కల్పిస్తామని తెలిపారు. నామినేషన్ల వేయటానికి అభ్యర్థితో పాటు వచ్చే వారు కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఉండాలని చెప్పారు. ఓసి అభ్యర్థులు రూ 10 వేల సెక్యూరిటీ డిపాజిట్ , ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 5 వేల చెల్లించాల్సి ఉంటుందన్నారు. సువిధ పోర్టల్, ఈ.అఫిడవిట్ ద్వారా నామినేషన్లు, ఆన్లైన్లోనే డిపాజిట్ మొత్తం చెల్లించేలా వీలు కల్పించిందన్నారు. ఆన్లైన్లో నామినేషన్లను సమర్పించి నప్పటికీ ఆ పత్రాలను ఫిజికల్‌గా ఆర్వోకు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియ గత సోమ వారంతో ముగిసింది అని చెప్పారు. ఈనెల 25వ తేదీ తర్వాత తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని, జాబితాలో పేర్లు ఉన్న వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. పూర్తి వివరాలను ఆఫీసు పని వేళల్లో సంప్రదించి పూర్తి సమాచారం తెలుసు కోవచ్చు అన్నారు. నామినేషన్లు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి లక్ష్మి కుమారి పేర్కొన్నారు.



తెనాలి రిటర్నింగ్ అధికారి కార్యాలయం



చలివేంద్రం ప్రారంభించిన సిఐ అనూరాధ

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎండల తీవ్రత దష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినంద నీయమని తుళ్లూరు సిఐ అనూరాధ అన్నారు. స్థానిక గ్రంథాలయం వద్ద మదర్ థెరిస్సా ఆటో యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో ఏర్పాటైన చలి వేంద్రంను సిఐ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు జెట్టి నరేంద్ర, హరికృష్ణ, మురారి, కొప్పుల యోహాను, జిలాని, జెట్టి వెంకటేష్, నరేష్ పాల్గొన్నారు.

బాప్టిస్ట్‌పేటలో వైసిపి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గం నుండి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మురుగుడు లావణ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి 15వ వార్డు లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం బాప్టిస్ట్ చర్చిలో మురుగుడు లావణ్య ప్రత్యేక ప్రార్థనలు చర్చి పాస్టర్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైయస్సార్ సిపి చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవి, వైఎస్ఆర్సిపి నాయకులు కలకోటి బోయాజ్, నందిగం వసంతరావు, కే స్వరూప రాణి, పి శ్యాంబాబు, కే చిన్న రాజా, టి జాను, మల్లవరపు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు



శ్రీరామనవమి వేడుకల్లో లోకేష్

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎపిఎస్ పి 6వ బెటాలియన్ లో కొలువై ఉన్న రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకలకు యువనేత నారా లోకేష్ హాజరయ్యారు. తొలుత శ్రీ సీతా రాముల వారిని దర్శించుకున్న యువనేత లోకేష్... అనంతరం కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, దామర్ల రాజు, పోతినేని శ్రీనివాస రావు, జనసేన నాయకులు చల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న తులసి ధర్మచరణ్

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీరామ నవమి సందర్భంగా గుంటూరులో ఏర్పాటు చేసిన శ్రీరాముని శోభాయాత్రలో వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా శోభాయాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీరాముని గుణగణాలను ధర్మచరణ్ వివరించారు.

ప్రజాశక్తి-తెనాలి : శ్రీరామనవమి వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వేసవి తీవ్రత నుంచి ఉపసమనం కలిగించేందుకు ఆలయాల వద్ద పెద్దఎత్తున చలువ పందిళ్ళను ఏర్పాటు చేశారు. స్థానిక గాడిబావి సెంటర్‌లోని సీతా రామం జనేయస్వామి వారి ఆలయం, రామస్వామి పేటలోని పట్టాభిరామస్వామివారి దేవస్థానం, బోస్ రోడ్డులోనీ సీతారామమందిరం, మారీసుపేట కోదండ రామ స్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా వచ్చారు. సీతారామంజనేయస్వామివారి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోగంటి రాంబాబు ఆధ్వర్యంలో కార్యనిర్వహణాదికారి జివి అమరనాథ్ పర్యవేక్షణలో నిర్వహించిన స్వామి వారి కల్యాణాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తిలకించారు. పట్టాభిరామస్వామివారి ఆలయంలో వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి దంపతులు పాల్గొన్నారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు



విజయకీలాద్రిపై అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో బుధవారం శ్రీంామనవమి వేడుకలు, సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి అనంతరం భారీఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పొన్నూరులో వైసిపి అభ్యర్థి మురళికృష్ణ ప్రచారం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని పునః ప్రతిష్టించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైసిపి అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పొన్నూరు పట్టణంలోని 24,25 వార్డుల్లో బుధవారం మర్కస్ మజీద్ వద్ద నుండి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వార్డుల్లోని ప్రజలు గజమాలతో స్వాగతం పలికారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పథకాలను వారికి వివరిస్తూ తిరిగి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన పునరుద్ధరించేందుకు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలో ఇంగ్లీష్ విద్యను అందించడంతోపాటు కార్పొరేట్ పాఠశాల లకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన ఘనత వైయస్ దని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్యం అందించడంతోపాటు వైద్యం అనంతరం వారికి ఆదుకునే ప్రభుత్వం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు.



తాడేపల్లిలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి 14వ వార్డు ముగ్గురోడ్డు, లంబాడీపేట ప్రాంతాల్లో వైసిపి నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జెసిఎస్ అధ్యక్షులు ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, దొంతి రెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎండి గోరేబాబు. మాచర్ల అబ్బు, సీనియర్ నాయకులు కూరగంటి ఉదయరాజు, ముదిగొండ ప్రకాష్. బేతం భాస్కర్, బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరిన మంగళగిరి పట్టణానికి చెందిన వాలంటీర్లు

లోకేష్ సమక్షంలో టిడిపిలోకి వాలంటీర్లు

ప్రజాశక్తి మంగళగిరి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సారథ్యంలో తమ భవిష్యత్తు బాగుంటుందని నమ్మిన 9మంది మంగళగిరి నియోజకవర్గం వాలంటీర్లు యువనేత నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఉండవల్లి నివాసంలో వాలంటీర్లకు యువనేత లోకేష్ పసుపుకండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని ఇప్పటికే స్పష్టంగా తెలియజేశామని అన్నారు. వాలంటీర్ల వేతనాలను రెట్టింపు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, వారి భవిష్యత్తుకు తాము భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కేవలం పెన్షన్ల పంపిణీనే కాకుండా ఇతర సంక్షేమ పథకాలు కూడా రాబోయే రోజుల్లో వాలంటీర్ల ద్వారా అందజేస్తామని లోకేష్ చెప్పారు. వాలంటీర్లు మాట్లాడుతూ... ఉన్నత విద్యను అభ్యసించిన తమకు చంద్రబాబునాయుడు నేతత్వంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని విశ్వసిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

జాగర్లమూడి మురళీమోహన్‌కు పేటెంట్


జాగర్లమూడి మురళీమోహన్

ప్రజాశక్తి-గుంటూరు :జోసిల్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, జెకెసి కాలేజి కార్యదర్శి, గుంటూరు జిల్లా మెన్, ఉమెన్ క్రికెట్ అసోసియేషన్ పూర్వచైర్మన్ జాగర్లమూడి మురళీమోహన్ నూతన ఆవిష్కరణకు పేటెంట్ లభించింది. కలకత్తాలోని ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం మంగళవారం ఈ మేరకు ధృవపత్రాన్ని అందించింది. క్రికెట్‌లో పిచ్‌కు ఇరువైపులా బ్యాటర్, బౌలర్ల దృష్టి మరలకుండా ఉండేందుకు రెండు పెద్దతెరలు ఉంచుతారు. వాటికి నలుపు, తెలుపు వస్త్రాలు ఉపయోగిస్తారు. వీటిని తయారు చేయటం, విని యోగించటం చాలాఖర్చుతో కూడుకున్నది. పని, తుపానులు, గాలి వానలు వచ్చి నప్పుడు కూలిపోవటం, పాడైపోతాయి. దీనికి సంబంధించి మురళీమోహన్ అతి తక్కువ ఖర్చుతో చాలా తేలికగా నలుపు, తెలుపు రంగులు మారే విధంగా ఖనిజంతో సైట్‌స్క్రీన్ తయారు చేశారు. గాలి వెళ్లే విధంగా, తుపానులో పడిపోని విధంగా ఈస్క్రీన్ తయారు చేశారు. చాలా సులభంగా పిచ్‌లకు ఎదురుగా, బ్యాటర్‌కు అనుకూలంగా సైట్ స్క్రీన్‌ను జరుపుకోవచ్చు. ఈ నూతన ఆవిష్క రణకు 20 ఏళ్ళపాటు మురళిమోహన్‌కు పేటెంట్ లభించింది. ఇది క్రికెట్ క్రీడతో అవినాభావ సంబంధం ఉంది. వీరి తండ్రి జాగర్లమూడి చంద్రమౌళి ఏసీఏకు అధ్యక్షులుగా వ్యవ హరించ టంతోపాటు గుంటూరు క్రికెట్ క్లబ్‌ను స్థాపించారు. చంద్రమౌళి కుమారులు నరేంద్రనాథ్, మురళీమోహన్ క్రికెట్ ఆటలో ఆంధ్ర లయోలా కళాశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ నేపథ్యంలో మురళీమోహన్ పేటెంట్ సాధించటం హర్షణీయం అని క్రీడాప్రముఖులు కొనియాడారు.

24 నుండి విజ్ఞాన్స్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు



విశాట్ ఫలితాలు వెల్లడిస్తున్న వీసీ, తదితరులు

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చరల్ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్-2024 ఫేజ్-1 ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పి.నాగ భూషణ్ మాట్లాడుతూ ఈ ఏడాది వీశాట్‌కు అనూహ్య స్పందన వచ్చిందని, ఏపీ, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు వీశాట్‌కు హాజరైనట్లు చెప్పారు. వీశాట్-2024 ర్యాంకులతో పాటు జేఈఈ మెయిన్స్ ఫలితాలు, ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్మీడియట్ మార్కులను కూడా పరిగణలోనికి తీసుకుంటామని పేర్కొన్నారు. వీశాట్‌లో 1 నుంచి 50 లోపు ర్యాంకర్లకు 50శాతం స్కాలర్‌షిప్, 51 నుంచి 200లోపు ర్యాంకర్లకు 25శాత స్కాలర్‌షిప్, 201 నుంచి 2000లోపు ర్యాంకర్లకు 10శాతం స్కాలర్‌షిప్‌ను నాలుగేళ్లపాటు అందిస్తామని చెప్పారు. వర్సిటీలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 24 నుంచి 30 వరకు మొదటి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అలాగే ఇంటర్ మార్కులు, జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా స్కాలర్‌షిప్ ఇస్తామని వివరించారు. వీశాట్ ఫేజ్-2 ప్రవేశ పరీక్షలను మే 1 నుంచి 15వ తారీఖు వరకు నిర్వహిస్తామన్నారు. వీశాట్‌లో మొదటి పది ర్యాంకులను అన్నమయ్య మద్దినేని బాలమూర్తి, ప్రకాశం జిల్లా దవ్వలూరి లోకేష్‌రాజ్, తూర్పు గోదావరి జిల్లా ఓ.శివ మణికంఠ, పర్వతనేని కార్తికేయ చౌదరి, కాకినాడ జిల్లా పీ.బాల శివసత్యనారాయణ, పల్నాడు జిల్లా గోరంట్ల అచ్యుత కుమార్ ఎన్‌టిఆర్ జిల్లా వై.మణి ధీరజ్, నంద్యాల జిల్లా జీ.హిమనీష్ నందన్ రెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా కే.సత్య సాయిదుర్గసాత్విక్, అనంతపురం జిల్లా ఐ. వినయ్‌కుమార్‌రెడ్డి సాధించారు. కార్యక్రమలో విజ్ఞాన్ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీరావు, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ క్రిష్ణకిషోర్ పాల్గొన్నారు.

అభ్యర్థితో నలుగురికే అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు :ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్ దాఖలు చేయడానికి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుండి గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల పరిధిలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి కమిషనర్ చాంబర్‌లో, గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సబంధించి సిటీ ప్లానర్ చాంబర్లో నామినేషన్ల స్వీకరిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల నుండి నామినేషన్ దాఖలు చేసే అభ్యర్ధితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఇప్పటికే తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబందించి నామినేషన్ల ఫారాలు అందించడం, ఫారాల పూర్తికి అవసరమైన సూచనల కోసం హెల్ప్ డెస్కులు కూడా ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్లు స్వీకరించే జిఎంసి ప్రధాన కార్యాలయం పరిసరాల్లో బారికేడింగ్ ఏర్పాటు చేశామని, నగర పాలక సంస్థ ఉద్యోగులు కూడా గుర్తింపు కార్డులు ధరించి కార్యాలయ విధులకు హాజరు కావాలని ఆదేశించారు.

25 నుండి షటిల్ బ్యాడ్మింటన్ వేసవి శిబిరం

ప్రజాశక్తి తెనాలి : 25 తేదీ నుండి విద్యార్థులకు షటిల్ బ్యాడ్మింటన్ లో వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు కొత్త ఐజక్ శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్(కిస్బా) అధ్యక్షులు తాళ్ళూరి రవీంద్రబాబు చెప్పారు. స్థానిక కరుణానిలయం విద్యాసంస్థల ఆవరణలో బుధవారం రాత్రి రవీంద్రబాబు షష్టి పూర్తి వేడుకలను కిస్బా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ బ్యాట్మింటన్ లో ఆసక్తి కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉచితంగా శిక్షణ నిర్వహిస్తున్నామని, పదోతరగతి లోపు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజూ ఉదయం 5గంటల నుంచి 7.30వరకూ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కిస్బా కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్, ఉపాధ్యక్షులు పి.రాంబాబు, కోశాధికారి ఎం.రమేష్, కె.జార్జిథామస్, ఎస్కే కరిముల్లా, సైదులు, ఎస్ యిర్మియ, సిహెచ్ పీటర్ పాల్, నెక్ బిడిసి బృందం కె.శ్రీకాంత్, వేణు, గోపి, సమాధానం, మహేష్, సతీష్, జగన్, కరింశెట్టి సుబ్బా రావు, టి.నంబ్బారావు పాల్గొన్నారు.


తాళ్లూరి రవీంద్రను సత్కరిస్తున్న క్రీడాకారులు

నేటి నుండి నామినేషన్ల స్వీకరణ

రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి

గుంటూరు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు


గుంటూరు జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి యం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నోటిఫికేషన్‌తోపాటు నేటి నుండే నామిషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పార్లమెంట్ స్థానానికి కలెక్టర్ కార్యాలయంలో, అసెంబ్లీ స్థానాలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 18 నుండి 25వ తేదీ వరకూ అన్ని పని దినాల్లో ఉదయ 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. శెలవు రోజు నామినేషన్లు స్వీకరించబడవని చెప్పారు. ఒకొక్క అభ్యర్థి నాలుగు సెట్ల వరకూ నామినేషన్ దాఖలు చేయవచ్చని, అభ్యర్థులు నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఫార్మ్-26లో మార్పులు జరిగాయని అభ్యర్థులు గమనించి, కొత్త ఫార్మ్-26లోనే నామినేషన్ దాఖలు చేయాలన్నారు. గుంటూరు పార్లమెంట్‌కు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో, తాడికొండ ఎంపిడిఓ కార్యాలయం, మంగళగిరి ఎంటిఎంసి కార్యాలయంలో, పొన్నూరు మున్సిపల్ ఆఫీస్, తెనాలి సబ్ కలెక్టర్స్ ఆఫీస్ నందు, ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం, గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలకు జిఎంసి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులకు నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. నామినేషన్‌కి వచ్చేవారు నిబంధనలు తప్పకుండ పాటించాలన్నారు.రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల లోపు కేవలం 5 గురికి, 3 వాహనాలకి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ఇప్పటకే 193 సింబల్స్‌ను గుర్తించిందన్నారు. జిల్లాకు ఎన్నికల అబ్జర్వర్లను నియమించటం జరిగిందన్నారు. జిల్లాలో 1915 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 13800 మంది సిబ్బందిని ఎన్నికలకు సిద్ధం చేస్తున్నామని, ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే మొదటి విడత శిక్షణ పూర్తి అయ్యిందన్నారు. 29వ తేది నామినేషన్ ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితా అయిన తరువాత రెండవ శిక్షణ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులకు, 85 సంవత్సరాలు దాటిన వారికి ఇంటి వద్దనే ఓటు వేసుకునే అవకాశం కలిపించటం జరిగిందని, బిఎల్‌ఓలు గుర్తించిన వారికి ఫామ్-12డి అందజేయటం జరిగిందని, 22 వ తేది సాయంత్రం 5 గంటలలోపు ఆర్‌ఓలకు 12డి ఫార్మ్ అందించిన వారికి మాత్రమే బ్యాలెట్ ఓటు ఇవ్వటం జరుగుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో, 12 వందల ఓటర్లు ఉన్న కేంద్రాలలో గైడ్ లైన్స్ ప్రకారం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని, ఈవిధంగా జిల్లాలో దాదాపు సగం కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందన్నారు. అసెంబ్లీ అభ్యర్థులు రూ.40 లక్షలు, పార్లమెంట్ అభ్యర్థులు రూ.90 లక్షల లోపు ఖర్చు చేయాలని, రాజకీయ పార్టీలకు టారిఫ్ రేట్లు కూడా అందజేయటం జరిగిందన్నారు. అభ్యర్థి పెట్టె ఖర్చులను జాగ్రత్తగా పరిశీలించటం జరుగుతుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వటం జరుగు తుందని తెలియజేశారు. 26 తేదీన స్క్రూటిని పరిశీలన, 29వ తేది విత్ డ్రాయల్స్ అనంతరం పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా వస్తుందని, మే 2వ తేది తరువాత బ్యాలెట్ పేపర్లు వస్తాయని తెలియజేశారు. జిల్లాలో 370 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై వెబ్ క్యాస్టింగ్‌తో ప్రత్యేకంగా, అదనపు భద్రత కల్పించటం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జేసీ రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రాజధాని అభివృద్ధి ప్రణాళికను ధ్వంసం చేశారు

రాజధానిలో పర్యటించిన గుంటూరు ఎంపి కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి - తుళ్లూరు


రాజధాని అమరావతిలో పర్యటిస్తున్న పెమ్మసాని తదితరులు

రాజధాని అమరావతి అభివృద్ధి ప్రణాళికను వైసిపి ప్రభుత్వం ధ్వంసం చేసిందని గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గ టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. మంగళవారం ఆయన రాజధాని అమరావతిలో పర్యటించారు. ఉద్దండరా యునిపాలెంలో ప్రధాని నరేంద్ర మోదీ రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల భవనాలు,బి ఆర్ అంబేద్కర్ స్మృతివనం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాజధానిలో ఇన్ సైడ్ ట్రేడింగ్ జరిగిందని జగన్మోహన్ రెడ్డి అబద్ధాలు చెప్పారని, అనేక ఆరోపణలలో ఒక్కటి కూడా ఐదేళ్లలో నిరూపించలేక పోయారన్నారు. 125 కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కంపెనీలు ఇక్కడ వస్తే వాటిని అడ్డుకున్నారని అన్నారు.10 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని, రాజధానిలో ఐదు వేల టిడ్కో గృహాలు వృథాగా వదిలేశారని విమర్శించారు. రాజధాని అభివద్ధికి గత ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను జగన్ ధ్వంసం చేశారని, ఆర్ 5 జోన్ పేరిట అభివృద్ధి కారిడార్ ప్రాంతాన్ని విధ్వంసం చేశారని చెప్పారు. అమరావతిలో హృదయ విదారకమైన పరిస్థితి కన్పిస్తోందని, ఒక ఉన్మాది అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో అమరావతి ప్రత్యక్ష ఉదాహరణని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధ నేకుల సుబ్బారావు, పులి చిన్నా,ౖంతు జెఎసి నాయకులు పువ్వాడ సుధాకరరావు, నూతలపాటి రామారావు, చిలకా బసవయ్య, బిజెపి, జనసేన నాయకులు యర్రగోపు నాగరాజు, సరిపూడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి పరాజయం తప్పదు : మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి పరాజయం తప్పదని మంత్రి విడదల రజని తెలిపారు. గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో 22,28 డివిజన్‌ల నుంచి టీడీపీకి చెందిన పలువురు బుధవారం మంత్రి విడుదల రజని సమక్షంలోవైసిపిలో చేరారు. స్థానిక చంద్రమౌళి నగర్ వైసీపీ కార్యాలయంలో సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు ద్వారా పేదలకు ఎంతో మేలు చేస్తున్న వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఆదరణ ఉందన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు బీజేపీ జనసేనతో పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. తొలుత 22వ డివిజన్‌లోని శ్రీనివాసరావుపేటలో వైసిపి నాయకులు గేదెల రమేష్, జానీ బాషా, తంగిరాల మార్కొండా రెడ్డి, సయ్యద్ జానీ, ఎర్రబాషా తదితరుల ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. 28వ డివిజన్ సీతమ్మ కాలనీ నుంచి స్థానిక కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 50 ఎస్టీ కుటుంబాలు టీడీపీ నుంచి వైసిపి లో చేరాయి. కార్యక్రమంలో మంత్రితోపాటు ఎమ్మెల్యే మద్దాలి గిరి కూడా ఉన్నారు.

నామినేషన్ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి నేటి నుండి 25వ తేదీ వరకూ గుంటూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్న దృష్ట్యా కలక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నామినేషన్లు వేయటానికి వచ్చే అభ్యర్థులకు ఏర్పాట్లు, ఇతరులు రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలోకి రాకుండా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యారికెడ్లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్ర మంలో డిఆర్ఒ పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు జిల్లాలో 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణు గోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నోటిఫికేషన్‌పై సమావేశం నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు, అఫిడవిట్‌లు పూర్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా 238 అప్లికేషన్స్ వస్తే 100 నిమిషాలలోపే సమస్యను పరిష్కరించటం జరిగిందని, వీటిలో 7 కేసులు మాత్రమే 100 నిమిషాలు పైబడి పరిష్కరించటం జరిగిందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వాహనాలకు జిపిఎస్ సౌకర్యం కల్పించటం జరిగిందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రకటనలకు, మైక్ అనౌన్స్మెంట్ కంటెంట్లకు అనుమతులు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసిఎంసి) ద్వారా తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్ఒ పెద్దిరోజా, రిటర్నింగ్ అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.